# ఆలోచన

మొత్తానికి సూర్యనారాయణ మనస్సు ఎప్పుడూ విశ్రాంతిగా వుండదు. చిక్కు వీడని సమస్యలెన్నో అట్టే వుండగా, ఇప్పుడు కొత్తగా భార్య ఒక సమస్యగా తయారై కూచుంది. అంటే-----బ్యాంక్ బాలెన్స్ నిల్ అయినాక కూడా అవి తెమ్మనీ ఇవి తెమ్మనీ వేధిస్తోన్నదనీ కాదు-----పాప మా పిల్లకు కోరికలనేవి లేవు. అదంతా ఒక ప్రత్యేక విషయం!

సూర్యనారాయణ తను పొరపడుతున్నాననుకున్నాడు. కాదు... ఒకసారి, రెండుసార్లు... మూడోసారి కూడా అంతే అయింది. కేవలం కాకతాళీయం అని ఆత్మవంచన చేసుకోటం మటుకెట్లా? ఇది కేవలం ఒక అతీత శక్తే అయియుండాలి! అయితే ఇది తనభార్య కెట్లా అబ్బింది? దీనికి రెమెడీ ఏదో కనుక్కుంటే గాని తనకు నిద్ర పట్టదు.

కాదామరి? భార్య ముందుగా కూర్చుని ఏవీ అనుకునేందుకు లేదు. ఏ విషయమూ ఆలోచించుకోలేదు. మనసుకు ఒక తాళం వేసి కూచోవాలి. లేకుంటే తన అంతరాత్మ తాలూకు దురూహలన్నీ బయటబడి పోతై. తనను చవటగా మిగులుస్తాయి. అదే సూర్యనారాయణ సమస్య----తనభార్యకు 'థాట్ రీడింగ్'ఎట్లా అలవడింది?

మొదటి రోజే అతనికి అనుమానం వేసింది. ఒంటరిగా కూచుని కాలు వూపుతూ గడ్డం కింద చెయ్యేసుకుని తోచీతోచని పరిస్థితుల్లో తనేదో మనస్సుతో మంతనాలాడుతుంటే, వచ్చింది తన భార్య ''ఏమిటండీ ఆలోచిస్తున్నారు?'' అంటూ.

''అబ్బె---- ఏమీలేదు ఊరికే నించున్నాను.'' అన్నాడు తను అసందర్భంగా మాట్లాడుతున్నదికూడీ గమనించకుండా.

''మీరు చెప్పకపోయినా నాకు తెలుసు లెండి, నాదగ్గర మీ దాపరికాలేవి పని చెయ్యవు.''

"తెలిస్తే చెప్పు చూద్దాం"

"ఊహు, నే చెప్పను."

"తెలిస్తేగా---అసలు తెలిసినదాని వయితే యెందు కడిగావు మొదట?" ఈ మాటతో భార్యకు పౌరుషం వచ్చి జవాబు చెప్పేస్తుందను కున్నాడు సూర్యం.

అతి నింపాదిగా అన్నది "చెప్పమంటారా అయితే," భార్య నిబ్బరానికి ఆశ్చర్యపోతూనే "చెప్పమనేగా నేననేది?" అన్నాడు.

"మీరు నన్ను గురించే ఆలోచస్తున్నారు?"

"అమ్మదొంగా , ఎట్లా కనుక్కున్నావు నువ్వు----" అంటానే తటాలున మనసులో ఊహ మెదిలింది. ఈ పాటి ఎవరైనా చెప్పెయ్యగలరు, ఇందులో విశేషం ఏమీ లేదని!

----ఒక్కసారి బెరుగ్గా భార్యముఖంలోకి చూచాడు. ఆమె లేతగా నవ్వింది. నవ్వుతూన్నట్టు కనిపించకుండానే నవ్వింది.

"ఎందుకు నవ్వుతావు?"

"మీ అనుమానం"

"నా కనుమానం ఏమిటి?"

"ఏమిటో మీకు తెలుసులెండి మీరు అనుకుంటున్నది నిజం కాదు లెండి" అన్నది భార్య.

ఇందులో కూడా సూర్యానికి విశేషం కనిపించలేదు.

ఇంతవరకూ సూర్యనారాయణకు తన భార్యకు 'థాట్‌రీడింగ్' చేతనవునని అనుమానమే కలుగలేదు. ఒకనాడు తను ఆఫీసుకు పోబోతోండగా ఇవాళ తొందరగా వచ్చి నన్ను సినిమాకు తీసుకెడదామనుకుంటున్నారు కదండి" అన్నది.

అది ఆమె మనసులో కోరికా లేక తన ఆలోచనని చదివేసే మేధా సంపత్తా? సూర్యనారాయణకి అర్థం కాలేదు. అది ఆవిడ కోరికే అయితే, ఇద్దరిలో ఇవాళే ఎందుకు కలగాలి? అతనికి నిజాన్ని ఒప్పుకోటంలో అందం కనిపించలేదు.

"నేనేమి అనుకోటంలేదు. నీకు సినిమాకి వెళ్ళాలనుందా?"

''అబద్ధమాడకండి. నిజంగా మీరనుకోటంలేదా? నా వేపు చూచి చెప్పండి''

సూర్యనారాయణ భార్య తనని దోచుకుంటున్నట్టు ముఖం పెట్టాడు. ''అయితే సినిమాకు వెడదామంటావా?''

''నే చెప్పింది నిజమవునా కాదా,అది చెప్పరేం,'' అని భార్య నిలదీసింది. ఇంకా ఆత్మవంచన చేసుకోవటం అవసరమనిపించలేదు అతనికి.

''నేను సినిమాకు రానేమోనని సందేహిస్తున్నారు మీరు. తీసుకెళ్ళాలే గాని ఎందుకు రానంటానండీ? నాలుగ్గంటలకే ఇంటికొచ్చేస్తారుగా'' అంటూ సాగనంపింది ఆఫీసుకు.

అతనికేమీ సమాధానం కుదర్లేదు. ''పెళ్ళిలో మా నాన్నని రిస్టువాచి అడుగుదామనుకున్నారు మీరు, మళ్ళా అడగటం చేతకాక ఊరుకున్నారు. ఇప్పటికీ అడగాలనే వుంది. ఎట్లా అడగుదామా అని సందిగ్ధపడుతన్నారు. ఎందుకండీ ఇంత ఆలోచన? వచ్చే పండక్కి మీకు రిస్టువాచి ఇప్పించే పూచీనాది!''

అబ్బ ఇంత నిక్కచ్చిగా తన మనసును పుస్తకం పేజీలు విప్పి చదువుతున్నట్లు చెబుతుంటే ఇంకేమనుకోవాలి?

కొంపదీసి, తన భార్యకు తాను పరోక్షంలో అనుకునే మాటలు కూడా తెలీవు కదా! ఎన్నోసార్లు తనభార్య అందాన్ని గురించి ఫర్వాలేదులే అని మనసులో సర్టిఫికేట్ ఇచ్చుకుని సంతృప్తిపడ్డాడు మరి! ఏమైనా భార్య ఎదుట పడ్డప్పుడు ఈ ఆలోచన రాకుండా వుండాలి కదా! ఎంత దారుణం?

ఆత్మ వంచన చేసుకోటం ఎప్పుడైతే కూడదనుకున్నాడో, మరో దొడ్డిదోవ కోసం వెతగ్గా అదీ దొరికింది. తన మనసులో భార్యకు తెలిస్తే మట్టుకేం? ఈ మాత్రం ధీమా తను నిలబెట్టుకో గలిగితే ఇంక తనకేం కొరత వుండదు. పైగా భార్య దగ్గర దాపరికం వుండకుండా, ఈ ఏర్పాటయినా బాగానే ఉంటుంది! ఏమంటే, తనూ ఎప్పుడైనా ఒళ్ళు తెలియకుండా ఏవేనా తప్పుడుపనులు----కనీసం అలాంటివి?---- చేస్తుంటే తన భార్య తనని సరిదిద్ది సక్రమమార్గంలో పెట్ట గలుగుతుంది. ఏం ఈ మాత్రం అవకాశం తన భార్యకి వుండటంలో తప్పేముంది?---- అని సమర్థించుకో సాగాడు సూర్యనారాయణ!

కాని దురదృష్టవశాత్తూ, ఈ థీమా కూడా ఎక్కువకాలం పనిచెయ్యలేదు. ఏమంటే, ఎంత తను భార్యకి ద్రోహం తలపెట్టని వాడయినా, తను దాచుకోవలసిన సంగతులు కొన్ని వున్నాయని (క్రమేపీవుంటాయని గూడా!----) అతనికి తెలిసి రాసాగింది.

బద్ధకంగా వుండి జాప్యం చెయ్యడం మూలాన ఆఫీసులో అధికారి ఎదట చీవాట్లు తప్పాయి కావు. ఆరు నెలలై పాతిక రూపాయలు అప్పు తీసుకుని ఇదుగో, అదుగో అంటూ తప్పించుకుపోయే కబుర్లు చెబుతున్నందువల్ల ఒక్క దుర్ముహూర్తాన సీతాపతి గారిచేత తిట్లు తినకతప్పింది కాదు. ఒకటా రెండా జీవితంలో ఇలాటి దెబ్బలు లక్షోపలక్షలుగా వచ్చి పడతయి. ఇవన్నీ ఎంత మాత్రమూ గృహిణి ఎదుట పడకూడదు గదా. పడితే బ్రతుకు మరీ దుర్భరం కాక మానదు గదా! పోతే ఇంక మార్గాంతరం ఏమిటి?

సాధ్యమైనంత వరకూ తను పొరపాటు పనులేమీ చెయ్యడు. చేసిన వాటిలో విధివశాన ఏమయినా పొరపాటుగా పరిణమించ వచ్చును! అల్లాంటి సందర్భాలు భార్య నోటీసులోకి వెళ్ళకుండా వుండగలగటం ఎట్లా? మొదట్నుంచీ సూర్యనారాయణ గుంభన అయిన మనిషీ, గంభీరమైన మనిషీని!

అతని ఆలోచన పరిపరి విధాల పోయింది. నిజానికి 'థాట్ రీడింగ్' అనేది ఎంత అద్భుతమైన విద్య. నేర్చుకుంటే రాదు. ఆ విద్యతో ఎన్ని సదాశయాలు సాధించవచ్చు! ఆ విద్య వచ్చి వుండటం గర్వ కారణమే. కాగా తన విషయంలో ఇంత ఖేద కారణం అయిందేమి? ఒక్కోడికి అమృతంలా పనిచేసే మందు, మరోడికి విషం అవటమంటే ఇదే కావును? ఎవడు కానీ, మంచి చెడు అలావుంచి దుర్భరమైన నగ్నసత్యాన్ని తెల్సుకో కలగటం ఎన్ని అసాధ్యాలకు దారి తీస్తుంది! సూర్యనారాయణ ఈ విషయంలో వరప్రసాదిని అయిన తన భార్యను మనసారా అభినందిస్తున్నాడు. అందుకు సందేహం లేదు. కాని తన స్థితేమిటి? బొత్తిగా అసమర్థుడిలా తయారయి పోవాలి! బుర్ర ఎక్కడ తాకట్టు పెట్టేట్లు?

"మీరట్లా అనుమానంగా నా ముఖంలోకి ఎందుకు చూస్తున్నారో నాకు తెలుసు? ఎంత అమాయకులండీ మీరు. మీరనుకునేదేమిటో ముఖం మీదే రాసేసుకుంటారే? అచ్చక్షరాలలాగా స్పష్టంగా కనిపిస్తాయి" సూర్యనారాయణకు నవ్వాలో, యేడవాలో తెలీదు. భార్యా భర్త సంబంధాలనేవి పూర్వమే రాసిపెట్టి వుంటాయనీ, అర్ధాంగి అవటంచేత మనోభావాలను ఇట్టే అకట్టేస్తుందనీ, ఈ గుణంగా తమ దాంపత్యం ఆదర్శప్రాయమయిందనీ అనుకుందుకు తరువాయి భార్య

పుద్దేశ్యాలేమిటో తనకు ఆమె మాటలు విన్నా అర్థంకావే, ఎట్లా? అదీకాక, ఎదట ఎవరుంటే వాళ్ళ మనసులే చదివేస్తుంది ఈవిడగారు!

--ఈ విషయం తనకు ఘనతర సమస్య కావటం ఆమెకూ సమస్యే అయింది తద!

"అస్తమానూ ఎందుకండీ అదే ఆలోచన? ఇంకేమీ పనిలేనట్టు? మీ మనస్సు నేను కనుక్కోవటం మీకంత బాధగా వుంటే, మానేస్తాను లెండి పోనీ" అన్నది కదా అని తను మాత్రం సంతోషించటం ఎట్లా? తన తృప్తికోసం పైకి చెప్పటం మానేసినా లోపల లోపల ఆమెకు తననుకునే మాటలన్నీ తెలుస్తోనే వుంటాయిగదా? తెలిసిన విషయాన్ని, అందునా అత్యద్భుత శక్తి ద్వారా తెలిసిన విషయాన్ని బహిరంగ పరచకపోవటం మానవులకు ఎంత కష్టంతో కూడుకున్న పని! ఒక్కొక్కప్పుడు పొట్టవుబ్బి చావుకు సిద్ధంకావటంకూడా కథల్లో వున్న సంగతే. అసలామె ఈ విద్య తనముందు ప్రదర్శించకుండానే వుండాల్సింది. గతజలసేతుబంధనం వల్ల ప్రయోజనం ఏమిటి?ఎట్లానూ తను భార్యముందు తలయెత్తు కూర్చుండలేకపోయాడు. భార్యతో మనస్ఫూర్తిగా మాట్లాడలేకపోయిన తర్వాత ఇంక తనకు సుఖం మటుకేం వుంటుంది కనక?

"ఇప్పుడు నేనేమనుకుంటున్నానో చెప్పు చూదాం" అన్నాడు సూర్యనారాయణ అకస్మాత్తుగా ఒకనాడు. ఇట్లా ఎందుకు అడిగాడో అతనికే తెలియదు.

"మీరేమనుకునేది నాకేం తెలుసునండీ. నేను అట్లా కనుక్కోటం మానేశానుగా?"

"ఎప్పట్నించీ?"

"ఆవాళ మీతో చెప్పినప్పట్నించీనీ! మీ కిష్టంలేని పని ఎందుకు చెయ్యాలి?"

----ఈ మాట నిజమే అయితే తన భార్య ఎంతోమంచిదనే తనకు తోచింది. నిజమే అయితే----ఎంతమాట! తను ఇట్లా శంకిస్తే, భార్య ఏం బాధపడుతుందో కదా! ఆమె మాటలు అబద్ధమనుకునే భావహీనత తనకెందుకుండాలి? సూర్యనారాయణ మనసులో చెంపలు వేసుకున్నాడు. ఇకముందు తను భార్యముందు నిస్సంకోచంగా కూర్చోగలడు.

----అయినా అమె ఆ పని చేయటం శాశ్వతంగా మానేయాలి కదా! మాని వేద్దామని వున్నా, మనసు ఆ మాట వినాలి కదా! మనస్ఫూర్తిగా చెయ్యగూడదనుకున్న పనులే, విధిగా, తప్పనిసరిగా చేస్తూండటం సహజం! ఒక తమాషా విద్యంటూ రాకుండానే వుండాలి కాని, వచ్చాక దాన్ని ప్రదర్శించకుండావుండటం సాధారణంగా అసాధారణమైన విషయం మరి!

అయితే, తనభార్య ఈ పని మానేసిందో లేదో టెస్టు చెయ్యటం ఎలాగ? ఆమె ఎక్స్‌ప్రెషన్స్ స్టడీ చేసేలా తను మాట్లాడితే?---- ఉహూ లాభంలేదు. తన మనోభీష్టం తెలుసుకుని, భార్య తనకు నచ్చే విధంగా ప్రవర్తించవచ్చును. ఎట్లయినా----కాలాంతకురాలు మరి! ❋

(ఆంధ్రప్రభ- సచిత్ర వారపత్రిక)